క్లుప్తంగా

ఘనంగా పోచమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



సంగెం : మండలంలోని కుంటపల్లి గ్రామంలో పోచమ్మతల్లి, మైసమ్మతల్లి విగ్రహాలను పునఃప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం ఘనంగా ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు తమ ఇళ్ల నుంచి నీటి బిందెలతో ఆలయానికి చేరుకుని విగ్రహాలను పసుపు, కుంకుమ కలిపి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, తదితరులు పాల్గొన్నారు.

విరాళం



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని రంగనాయకుల గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రామచంద్రాపురం గ్రామానికి చెందిన జేసీబీ ఓనర్ ఉడుతబోయిన ప్రభాకర్–కనుకమ్మ దంపతులు రూ.11వేల 116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు అభినందించి మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి మరింత మంది ముందుకు రావాలని ఆకాంక్షించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ




ఉదయ్‌కిరణ్ రాజ్‌కుమార్

ఖానాపురం : జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో అశోక్‌నగర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ స్వామి, డైరెక్టర్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదువుతున్న జాదవ్ ఉదయ్ కిరణ్ జాతీయ స్థాయిలో గిరిజన కేటగిరీలో 736వ, బానోత్ రాజ్‌కుమార్ 1287వ ర్యాంకు సాధించగా ఆడవత్ చందు 509, పాల్తావత్ నవీన్‌కుమార్ 838, జాదవ్ విజేందర్ నాయక్ 1131, ఇస్లావత్ ఠాగూర్ 1521 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్

నల్లబెల్లి : మండలంలోని ఆసరవెల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గుండెబోయిన సాంబయ్యను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో సస్పెండ్ చేసినట్లు మేడపల్లి క్లస్టర్ ఇన్‌చార్జ్ మాలోత్ మోహన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు జలగం రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యకర్తలతో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇక నుంచి సాంబయ్యకు పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేశారు.

ధాన్యం చోరీ.. కేసు నమోదు



పర్వతగిరి : రోడ్డుపై ఆరబోసిన ధాన్యం చోరీకి గురైన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జి.వెంకన్న కథనం ప్రకారం.. మండలంలోని ఇస్లావత్‌తండా–ముంజాలకుంటతండా రోడ్డుపై మండల్‌బోడ్‌తండాకు చెందిన రైతులు మాలోతు సంతోశ్, మాలోతు వీరన్న ధాన్యం ఆరబెట్టి కుప్పపోశారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యాన్ని చోరీ చేశారు. ఈ విషయమై మాలోతు సంతోశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వెంకన్న ఘటనా స్థలిని సందర్శించి విచారణ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ), నీరుకుళ్ల ప్రత్యేక అధికారి చేతన్‌రెడ్డి అన్నారు. సోమవారం నీరుకుళ్లలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాల్లో అందించే సేవల వివరాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతం చేయాలని కోరారు. ఈ వర్షాకాలంలో గ్రామస్తులు కాచిచల్లార్చిన నీళ్ల మాత్రమే తాగాలని అన్నారు. ఇంటింటికి నల్లా కనెక్షన్ ఉందా.. లేదా తెలుసుకునేందుకు మిషన్ భగీరథ సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఇంటి యజమానులు అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలని కోరారు. ఎంపీటీసీ వరుణ్‌గాంధీ, పంచాయతీ కార్యదర్శి జితేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీరుకుళ్ల వారంతపు సంతకు వేలం పూర్తి

నీరుకుళ్ల వారంతపు సంత నిర్వహణకు సోమవారం వేలం పాట పాడినట్లు ఎంపీఓ చేతన్ రెడ్డి తెలిపారు. వేలం పాట రూ.28,200 లకు ఖరారైందని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన రాజేందర్ అంగడి కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నట్లు వివరించారు.

ఇంటి దొంగలపై చర్యలేవి?

● మున్సిపాలిటీలో పరికరాలు, కలప మాయం



మున్సిపల్ కార్యాలయం



ప్రకృతి వనంలో కోతకు గురైన టేకు చెట్లు

నర్సంపేట : నర్సంపేట మున్సిపాలిటీలో ఇంటి దొంగలపై చర్యలేవీ? అన్ని వ్యాఖ్యలు సర్వత్రా వినవస్తున్నాయి. కొద్ది రోజులుగా డీజిల్ ఇంజన్, ఇతర పరికరాలు, టేకు కలప మాయవుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై అధికారులు పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో మున్సిపాలిటీకి చెందిన డీజిల్ ఇంజన్ కనిపించకుండా పోయింది. ఈ విషయమై పలుమార్లు పత్రికల్లో కథనాలు వచ్చాయి. అయినా అధికారులు విచారణ చేపట్టలేదు. ఈ క్రమంలో ప్రస్తుత అధికారుల పని తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఏడో వార్డులోని పట్టణ ప్రకృతి వనంలో రెండేళ్లుగా టేకు చెట్లు కూలిపోగా, వాటికి సంబంధించిన విలువైన కలపను కాజేసినట్లు బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపాలిటీలో వినియోగించిన పరికరాలు పాడైపోయిన సందర్భంలో స్టోర్ రూంలో ఉంచి వాటి వివరాలను రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రజాసమస్యలపైనా నిర్లక్ష్యం..

మున్సిపల్ అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి. సుమారు 40 వేల జనాభా ఉన్న మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లోనూ తాగునీటి సమస్య ఉన్నట్లు ప్రజలు తెలిపారు. మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు పూర్తి చేయకపోవడంతో మురికి నీటినే తాగునీటిగా వాడుతున్న దుస్థితి నెలకొంది. ద్వారకపేట, నెక్కొండ రోడ్డు కాలనీలతోపాటు ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్, ఎక్సైజ్ కార్యాలయ సమీప కాలనీలకు భగీరథ నీరు అందడం లేదు. కొద్దిపాటి వర్షాలకే వరద నీరు రోడ్లపై నిలిచి ఇబ్బందులకు గురి చేస్తున్నా నివారణ చర్యలపై అధికారులు చొరవ చూపడం లేదు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు పైరవీ ఉంటేనే ప్రాధాన్యత ఇస్తుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

డ్రెయినేజీ అభివృద్ధికి నోచక దుర్భర పరిస్థితి

నర్సంపేట గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా, మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినా చాలా ఏళ్ల క్రితం నిర్మించిన డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధికి నోచుకోకపోవడంతో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ఫుట్‌పాత్ ఆక్రమణలతో రోడ్లు ఇరుకుగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రత్యేక నిధులు మంజూరు చేయించి పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత పాలకపక్షంపై ఉంది.

ఆక్రమిత భూమి 'రెవెన్యూ' స్వాధీనం

సాక్షి స్పందన



నల్లబెల్లి : విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

నల్లబెల్లి : మండలంలోని రేలకుంటలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 'రేలకుంటలో ప్రభుత్వ స్థలం కబ్జా' శీర్షికతో ఈనెల 9న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌ఐ రాజేంద్ర ప్రసాద్, సర్వేయర్ మల్లయ్య, రికార్డు అసిస్టెంట్ గోపీ గ్రామానికి సోమవారం చేరుకుని విచారణ చేపట్టారు. గ్రామస్తులతో, భూమిని ఆక్రమించుకున్న వ్యక్తితో మాట్లాడారు. ఆక్రమించుకున్న వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పల్లె దవాఖానా వైద్యులకు మెమోలు

మండలంలోని పల్లె దవాఖానాల వైద్యులకు మెమోలు జారీ చేసినట్లు మండల వైద్యాధికారి ఆచార్య తెలిపారు. 'వైద్యుల్లేక పల్లె దవాఖానాలు వెలవల' శీర్షికతో ఈనెల 8న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నందిగామ, రేలకుంట, ముచ్చింపుల వైద్యులు శృతి, మహంతి, నిఖిలకు మెమోలు జారీ చేశారు. సకాలంలో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఆచార్య మాట్లాడారు. పల్లె దవాఖానాల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పొదుపుతోనే కుటుంబాల ఆర్థిక పురోగతి



సమావేశంలో మాట్లాడుతున్న లింగయ్య

● గౌడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు లింగయ్య

నర్సంపేట : ప్రతీనెల డబ్బు పొదుపు చేసుకుంటేనే గౌడ కులస్తుల కుటుంబాల ఆర్థిక పురోగతికి బాటలు పడతాయని గౌడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గండి లింగయ్య గౌడ్ తెలిపారు. పట్టణంలోని పద్మశాలీ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన గౌడ సంక్షేమ సహకార పరమితి సంఘం ద్వితీయ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కులస్తుల ఐక్యత, సంక్షేమం కోసం పరస్పర సహకారం కీలకమని చెప్పారు. అనంతరం ప్రధాన కార్యదర్శి మాచర్ల ఐలుమల్లు సంఘ నివేదిక సమర్పించారు. సంఘంలో రూ.కోటి 13 లక్షల 61వేల 433 ఉండగా సభ్యుల వాటా రూ.29 వేల 80 చొప్పున ఉండగా అందులో ఖర్చులు లక్ష 65 వేల 410 రూపాయల అయినట్లు ఆర్థిక కార్యదర్శి గండి రఘు ప్రకటించగా సభ్యులు ఆమోదించారు. అనంతరం గౌడ వెల్ఫేర్ కమ్యూనిటీ భవన నిర్మాణం, సభ్యుల గ్రూపు ఇన్సూరెన్స్ చేయించేందుకు, రూ.2 లక్షల వరకు సాధారణ రుణ మంజూరు, తదితర అంశాలను తీర్మానించారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు బూర అశోక్‌గౌడ్, ఊడుగుల శ్రీనివాస్, బూర వేణు, రావుల లక్ష్మీనారాయణ, గంధం చంద్రమౌళి, కక్కెర్ల అశోక్, గండి నర్సయ్య, కందుకూరి జనార్థన్, వల్లాల శ్రీహరి, నవీన్‌కుమార్, చీకటి శోభారాణి, దొంతి శ్రీలత, రామగోని సుధాకర్, గొడిశాల భాస్కర్, గండి సంతోశ్, అనంతుల రమేశ్, కారుపోతుల విజయ్‌కుమార్, తాళ్లపెల్లి చంద్రమౌళి, పంజాల వెంకట్, జూలూరి హరిప్రసాద్, తాళ్లపెల్లి కృష్ణ, కందుల శ్రీనివాస్, గుల్లపెల్లి ఉమేందర్, గిరగాని సాంబయ్య, వేముల సాంబయ్య, వెంకటనారాయణ, సోల్తి సారయ్య, దొమ్మటి సత్యం, డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్, గండి యాదగిరి, పెరుమాండ్ల ఉపేందర్, తాబేటి రవి పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్



పర్వతగిరి : మండల కేంద్రంలో నాటు సారా విక్రయిస్తున్న ఆరుగురు మహిళలను అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారం అందడంతో సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎస్సై జి.వెంకన్న సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నెక్కొండ మండలంలోని మైబునాయక్ తండాకు చెందిన భానోతు లక్ష్మి, బాదావత్ పున్నమ్మ, భూక్య వీరమ్మ, బాదావత్ విజయ, భానోతు తారమ్మ, భానోతు రూప్లి నాటు సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.14 వేల 400 విలువైన 36 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

నివాళి



పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ తండ్రి సోమవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌నాయక్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి దిలీప్ గౌడ్, నియోజకవర్గ కార్యదర్శి కత్తుల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నీరటి ప్రశాంత్, నాయకులు ఎర్రబోయిన సాంబరాజు, దొనికి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బీఓఎస్ సభ్యులుగా ఎంపిక.. సన్మానం



ప్రిన్సిపాల్ నవీన్, ఆంగ్ల విభాగాధిపతి శ్రీనాథ్‌లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్, ఆంగ్ల భాషా విభాగాధిపతి డాక్టర్ శ్రీనాథ్ కాకతీయ విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగంలో 2024–25, 2025–26 విద్యా సంవత్సరాలకు బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యులుగా ఎంపికవగా వారిని కళాశాలలో స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు ఉండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సభ్యులు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ డాక్టర్ ఐ.శివనాగ శ్రీను, అకడమిక్ కోఆర్డినేటర్ ఎం.నరేందర్, టి.రమేశ్, ఎల్.సత్యనారాయణ, డాక్టర్ బి.విష్ణుకుమార్, డాక్టర్ జి.ప్రసూన, డాక్టర్ లకన్‌సింగ్, ఎం.సమ్మయ్య, డాక్టర్ ఎం.శైలజ, డాక్టర్ బి.రమేశ్, పి.త్యాగయ్య, డాక్టర్ వి.పూర్ణచందర్, వీరన్న, రమేష్, డాక్టర్ ఆర్.కుమారస్వామి, ఏఓ ఎస్.స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే యువతకు మెరుగైన ఉపాధి



కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : బీజేపీతోనే యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని కల్‌నాయక్‌తండాకు చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు అధ్యక్షతన బీజేపీలో చేరగా వారికి ఆయన కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. బీజేపీ యువతను ప్రోత్సహిస్తుందని తెలిపారు. రాజకీయాల్లో మెరుగైన అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. యువత రాజకీయాల్లోకి వస్తే దేశం మరింత ఉన్నతంగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, పార్లమెంటు కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, చెన్నారావుపేట మండల కన్వీనర్ దామెరుప్పుల శేఖర్, యువమోర్చా మండల అధ్యక్షుడు కొనకటి నవీన్‌రెడ్డి, నాయకులు దుంక దువ్వ రంజిత్, ఎర్ర రాజు, బక్కతట్ల రవీందర్, మురహరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయండి

● కలెక్టర్‌కు బాధితుడి వినతి



గీసుకొండ:కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సాంబయ్య

గీసుకొండ : తన ఇంటి స్థలాన్ని తప్పుడు పత్రాలతో ఇతరుల పేరిట చేసిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని ఎలుకుర్తి హవేలీకి చెందిన అల్లం సాంబయ్య జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తన సోదరుడు కుమారస్వామి తప్పుడు పత్రాలతో అతడి భార్య సుజాతకు అక్రమంగా గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించాడని తెలిపారు. అతడికి ఇల్లు లేకున్నా 1–133/2 ఇంటి నెంబర్‌ను సృష్టించాడని, తప్పుడు పత్రాలు తయారు చేసి వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించి రిజిస్ట్రేషన్ చేయించాడని వివరించారు.

కోళ్లఫారం నిర్మాణాలను నిలిపివేయాలని..

రాయపర్తి : మండలంలోని పన్యానాయక్‌తండాలో చేపట్టిన కోళ్లఫారాల నిర్మాణాలను నిలిపివేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు తండావాసులు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి దగ్గరగా ఉండడంతో రోగాల బారిన పడతామని ఆందోళన వెలిబుచ్చారు. సమస్య పరిష్కారానికి తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓలకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. నిర్మాణాలను నిలిపివేసే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భూక్య క్రాంతి, మాలోతు దేశిరాం, భూక్య ధరంసింగ్, భూక్య రాజారాం, రవి, కిషన్, కమల్‌సింగ్, బుచ్చన్న, గోపాల్, బాలాజీ, వెంకన్న, సక్రు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ చైర్మన్‌కు అభినందన



ఐనవోలు : తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన నందనం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సోమవారం నియమితులయ్యారు. ఈ మేరకు మండల నాయకులు, ఆయన అభిమానులు, నందనం సొసైటీ డైరక్టర్లు హైదరాబాద్‌లోని బ్యాంకు కేంద్ర కార్యాలయంలో ఆయకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నందనం సొసైటీలో డైరెక్టర్‌గా ఎన్నికైన మార్నేని రవీందర్ రావు సొసైటీ చైర్మన్‌గా, వరంగల్ డీసీసీబీ చైర్మన్‌గా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులవడం సంతోషంగా ఉందని నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు తెలిపారు. కాగా పలు గ్రామాల్లో రవీందర్‌రావు అభిమానులు బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. నందనం సొసైటీ డైరక్టర్లు బొమ్మినేని బుచ్చిరెడ్డి, మేటి చిరంజీవి, పూజారి రాంచంద్రం, మాదారపు సంపత్‌కుమార్, చింత బాబుతో పాటు సొసైటీ సీఈఓ కోతి సంపత్, మండల నాయకులు జోజిరెడ్డి, ఆడెపు దయాకర్, మునిగాల సంపత్‌కుమార్, బుర్ర రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



దుగ్గొండి : వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐ(యూ) నాయకులు దుగ్గొండి, రాయపర్తి, సంగెం, చెన్నారావుపేట, పర్వతగిరి మండలాల్లో తహసీల్దార్లకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. తొలుత నిరసన తెలిపారు. సంగెంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుగ్గొండి, రాయపర్తిలో ఆ పార్టీ నర్సంపేట, వరంగల్ డివిజన్ కార్యదర్శులు రాజా సాహెబ్, మంద రవి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని గద్దెనెక్కి తదనంతరం విస్మరించడం సరికాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు రైతుల, కార్మికుల, ఇతర అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయని కారణంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిందని గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో అర్హులకు అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్యం కీలకం

● 'గీతాంజలి గ్రూప్' చైర్మన్ సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

నర్సంపేట రూరల్ : ఉపాధ్యాయులకు వృత్తిలో నైపుణ్యం కీలకమని గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ వేములపల్లి సుబ్బారావు స్పష్టం చేశారు. మండలంలోని మహేశ్వరంలోని శివానీ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన టీచర్స్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. 21వ శతాబ్దపు బోధన అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులను సంసిద్ధులను చేసే దిశగా అవసరమైన బోధన, బోధనేతర నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ఎమోషనల్ లెర్నింగ్, సోషల్ లెర్నింగ్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన అవగాహన కల్పించేలా కృత్యాలతో శిక్షణ ఇస్తారని తెలిపారు. సమాజంలో ప్రస్తుతం నెలకొన్న ఒత్తిడిలో శారీరక, మానసిక ఆరోగ్యం పెంచే దిశగా శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీరాం కిరణ్, రామకృష్ణ, దేవేందర్, ప్రిన్సిపాల్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ఉల్లాసం

రాయపర్తి : ఆధ్యాత్మికతతో మానసికోల్లాసం లభిస్తుందని నూర్–ఏ–మస్జిద్, అలంగిరి మస్జిద్‌ల సదర్‌లు హుస్సేన్, అమ్జద్‌ఖాన్ స్పష్టం చేశారు. నెల రోజులుగా ఇస్లామిక్ క్యాంపు నిర్వహించగా ప్రతిభ కనబర్చిన చిన్నారులకు సోమవారం వారు బహుమతులు అందజేసి అభినందించారు. ఎండీ జుబేర్, మహ్మద్ అయాన్‌ఖాన్, ఎండీ.అయేషా ప్రతిభ చాటగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హుస్సేన్, అమ్జద్ ఖాన్ మాట్లాడారు. పిల్లలు క్యాంపును సద్వినియోగం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మతపెద్దలు ఇమామ్ ఇర్ఫాన్ సలామ్, మహ్మద్ అబ్దుల్, రెహ్మాన్, రహీమ్, నయీమ్, రఫీక్, ఫెరోజ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే ముమ్మరం

దామెర : మండల వ్యాప్తంగా మిషన్ భగీరథ సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు సోమవారం సర్వే చేసి మండలంలోని 6 వేల 283 గృహాలకు నల్లా కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించారు. కాగా ఇంటింటికి తిరుగుతూ కనెక్షన్ ఉందా.. ఉంటే నల్లాలు బిగించారా.. నీరు సరఫరా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌లో వివరాలు నమోదు చేయడంతో పాటు ఇంటి యజమాని ఫొటోను అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. కాగా మొదటిరోజు 433 ఇళ్లను సర్వే చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కల్పన, ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ అయ్యేనా?

దుగ్గొండి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలలో కొంత కాలంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు ఈ విద్యాసంవత్సరానికైనా భర్తీ అయ్యేనా? అన్న ప్రశ్న విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తోంది. ఉద్యోగ విరమణ, అకాల మరణం, తదితర కారణాలతో మండలంలో 18 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గిర్నిబావి, గుడ్డెలుగులపల్లి, స్వామిరావుపల్లి, తిమ్మంపేట, బంధంపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, నాచినపల్లి, చాపలబండ, మైసంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే దుగ్గొండి మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదేళ్లుగా పీడీ పోస్టు ఖాళీగానే ఉంటోంది. మల్లంపల్లి హైస్కూల్‌లో బయాలజికల్, సోషల్ స్టడీస్ పోస్టులు, తిమ్మంపేట హైస్కూల్‌లో సోషల్ స్టడీస్, తెలుగు పోస్టులు, మహ్మదాపురం హైస్కూల్‌లో బయాలాజికల్ సైన్స్ టీచర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. హైస్కూళ్లలో కీలకమైన సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో టెన్త్ ఫలితాలపై దుష్ప్రభావం పడుతోంది. ఇకనైనా ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని అన్ని ఖాళీల్లో ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య

ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అభిస్తుందని మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి బీసీ కాలనీలో సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థుల మానసిక సామర్థ్యం తెలుసుకుని అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. విద్యను అంగడి సరుకుగా మార్చి ప్రైవేటు విద్యాసంస్థలు సొమ్ము చేసుకుంటున్న క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించి సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు మధుకర్, సారయ్య, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, రాజేశ్వరి, పద్మ, సమ్మక్క, యశోద, రేణుక, దీపిక పాల్గొన్నారు.